క్లుప్తంగా

10న సత్సంగం, సామూహిక హారతి



కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

పరవాడ: దేవాలయం కేంద్రంగా సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భజనలు, సత్సంగాలు, సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లిమడుగుల నాగేంద్రరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 10న ధార్మిక జట్టు, దేవాలయ కమిటీ సభ్యుల సహకారంతో సత్సంగం కార్యక్రమం నిర్వహించాలని ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. అలాగే ఈ నెల 12న ప్రతి గ్రామంలో సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, సహాయ కన్వీనర్ బొద్దపు నూకరత్నం, సభ్యులు ఎం.హైమావతి, పెదపాటి రామచంద్రరావు, దేముడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పదో తరగతి ఉత్తీర్ణులకు ఆత్మీయ సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న చింతలగ్రహారం గ్రామ పెద్దలు

పెందుర్తి: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చింతలగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు ఆదివారం ఘనంగా సత్కరించారు. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన 103 మంది విద్యార్థులలో 99 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 30 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించడం గమనార్హం. పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన 99 మంది విద్యార్థులను గ్రామ పెద్దలు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. వారిని తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఇతర ఉపాధ్యాయులను కూడా ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు పులమరశెట్టి వెంకటరమణ, అళ్ల తాతారావు, పి.అప్పారావు, నాయకుడు మద్దాల శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొడ్డేటి నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా నవ్వుల దినోత్సవం



హాస్య కథ చెబుతున్న విద్యార్థిని

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు పలు హాస్య కథలు చెప్పి నవ్వించారు. విద్యార్థులు కూడా తమకు తెలిసిన హాస్య కథలను చెప్పి అందరినీ అలరించారు. అనంతరం, విశ్రాంత ఉపాధ్యాయుడు పాలెపు బంగారు చిట్టి విద్యార్థులకు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలను వివరించారు. అంతేకాకుండా, తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పఠన సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్వీ నరసింహం, కార్మిక నాయకుడు సీహెచ్. సూర్యనారాయణరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కథలు నేర్చుకుందాం రండి..



శిక్షణ పొందుతున్న చిన్నారులు

పెందుర్తి: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా యోగా, బొమ్మల తయారీపై కూడా శిక్షణ తరగతులు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్ చిన్నారులకు 'శిల్పకారుని తెలివి' అనే నీతి కథను బోధించి, అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. బి. లక్ష్మీతేజ విద్యార్థులతో యోగాసనాలు చేయించి, బొమ్మలు వేయడం నేర్పించారు. వాల్ హ్యాంగింగ్ ఆర్ట్ నిపుణురాలు భవానీ కార్పొర్దుతో అందమైన వాల్ హ్యాంగింగ్స్ తయారుచేయడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి బి. సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు

చెలరేగుతున్న మినరల్ మాఫియా



- గ్రామాల్లో సరిగా శుద్ధి చేయని తాగునీటి అమ్మకం
- అనధికారిక ప్లాంట్లతో సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- విచ్చలవిడిగా వెలుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లు
- కన్నెత్తి కూడా చూడని యంత్రాంగం

పెందుర్తి: ఎండలు మండిపోతుండటంతో గ్రామ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. బోర్లు, ప్రభుత్వ తాగునీటి పథకాలు సరిపోకపోవడంతో ప్రత్యామ్నాయంగా మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్న కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో సాదా నీటిని విక్రయిస్తూ లక్షలు గడిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారుతోంది. పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో ఇక్కడి ప్రజలు శుద్ధి చేసిన నీటిని కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రోజుకు లక్షల రూపాయల వ్యాపారం జరుగుతున్నప్పటికీ, వీటిలో 80 నుంచి 90 శాతం ప్లాంట్లకు ఎలాంటి అనుమతులు లేకపోవడం గమనార్హం.పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్లు కానీ, చాలా చోట్ల కనీస క్లోరినేషన్ లేదా ఫిల్టరేషన్ ప్రక్రియలు కూడా నిర్వహించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కలుషితమైన నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు వ్యాపారులు కేవలం సాధారణ నీటిని సీసాల్లో నింపి మినరల్ వాటర్ పేరుతో అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. భూగర్భ జలాల్లో తెల్లసుద్ద (ఫ్లోరైడ్) శాతం అధికంగా ఉండటంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటుగా విక్రయిస్తున్న మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు సబ్బవరం, పెందుర్తి ప్రాంతాల్లో అక్రమ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు 100కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయని అంచనా. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వీటిలో కేవలం 10–20 ప్లాంట్లకు మాత్రమే అధికారిక అనుమతులు ఉన్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాణ్యత లేని మంచినీటి ప్యాకెట్లు

తనిఖీలు ఉత్తమాటే

ప్లాస్టిక్ నియంత్రణ నిబంధనలను తుంగలో తొక్కుతూ అనేక ప్లాంట్లలో ఇప్పటికీ మంచినీటి ప్యాకెట్ల ఉత్పత్తి, విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో సంబంధిత అధికారులే చెప్పాలి. మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆహార భద్రత అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచాల్సి ఉండగా, మామూళ్లకు అలవాటు పడిన కొందరు అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో ఒక్క తనిఖీ కూడా జరగకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని అక్రమ ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



పెందుర్తిలో మూలకు చేరిన ప్రభుత్వ సుజల పథకం

నాణ్యత అంతంతమాత్రం

చాలా ప్లాంట్లు కేవలం బోరు నీటిని క్యాన్లలో నింపి, కొన్ని క్లోరిన్ ట్యాబ్లెట్లు వేసి మినరల్ వాటర్‌గా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లలో విక్రయిస్తున్న నీటి ప్యాకెట్లు ఆరోగ్యానికి మంచివి కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి 20 లీటర్ల మినరల్ వాటర్ కనీసం రూ.20కి విక్రయించడం సాధ్యం కాదు. కానీ కొన్నిచోట్ల రూ.10కి కూడా విక్రయిస్తున్నారంటే ఆ నీటి నాణ్యత ఏ విధంగా ఉంటుందో ఊహించవచ్చు.

ఆ నీరు తాగితే దీర్ఘకాలిక సమస్యలు



పెందుర్తి ప్రాంతంలో ఫ్లోరైడ్ ప్రభావం ఎక్కువ ఉందని నిపుణులు చెబుతున్నారు. తాగునీరు ఎలా సేకరించినా దాన్ని శుద్ధి చేసి తాగితేనే మంచిది. బోర్లు, బావుల నుంచి సేకరించిన నీటిని మరిగించి తాగాలి. ఆర్వోలు, మినరల్ ప్లాంట్‌ల నుంచి కొనుగోలు చేసే ముందు ఆ ప్లాంట్ ప్రమాణాలను దృష్టిలో పెట్టుకోవాలి.

–డాక్టర్.ఆర్ అవంతి,
డీపీఎస్, పెందుర్తి సీహెచ్‌సీ

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఆలయ అధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి విశాలాక్షినగర్‌కు చెందిన సుంకర శ్రీరాములు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. సింహగిరిపై ఉన్న దేవస్థానం పీఆర్వో కార్యాలయంలో వారు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్‌ను అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామా వళి పూజ భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ ఆర్జిత సేవలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అంతేకాకుండా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి ఉత్సవాలకు అంకురార్పణ
- ముస్తాబైన పెందుర్తి వెంకటాద్రి



ఉత్సవాలకు ముస్తాబైన వెంకటాద్రి, (ఇన్‌సెట్) వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: బ్రహ్మాండ నాయకుడు కొలువుదీరిన పెందుర్తి వెంకటాద్రి బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైశాఖ శుద్ధ దశమి ఎంతో పవిత్రమైన రోజు. శ్రీనివాసుడు పద్మావ తి అమ్మవారిని వివాహమాడేందుకు భూమిపై అడుగుపెట్టిన ఈ శుభ ముహూర్తాన, వెంకటా ద్రి నిర్మాణానికి తొలి అంకురార్పణ జరిగింది. ఈ నేపథ్యంలో, ఏటా వైశాఖ శుద్ధ దశమి నాడు బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. సోమవారం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరగనున్నాయి. ఉత్సవాల తొలి రోజు విష్వక్సేన పూజ, అంకురార్పణతో వేడుకలు ప్రారంభమవుతాయి. మంగళవారం ఉదయం ధ్వజారోహణ, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం, వైశాఖ శుద్ధ దశమి అయిన బుధవారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరగనుంది. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగుతుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పుర వీధుల్లో రథంపై ఊరేగు తూ, చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు స్వామివా రు భక్తులకు దర్శనమిచ్చి ఆశీర్వదిస్తారు. శుక్రవారం ఉదయం చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి స్వామివారు దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, ప్రత్యేక అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి అని ఆలయ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణమంతా ప్రత్యేకం గా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సందడి

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 33 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు.నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ప్రతి సంవత్సరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన తమ సహచరుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులందరికీ జ్ఞాపికలు అందజేశారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

పెందుర్తి: తమ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని ఆయన రౌడీషీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, చెడు ప్రవర్తన కారణంగా వారి కుటుంబాలు సమాజంలో చులకన అవుతాయని అన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని ఆయన తేల్చి చెప్పారు.

మామిడి గుభాళింపు



మామిడి కాయ ముక్కలు కొడుతున్న దృశ్యం



పెందుర్తి రైతుబజార్‌లో వివిధ రకాల మామిడి పండ్లు, కాయలు

పెందుర్తి: మామిడి పళ్ల సీజన్ ఊపందుకుంది. పెందుర్తి రైతు బజార్ మామిడి ప్రియులతో కళకళలాడుతోంది. బంగినపల్లి రుచి, సువర్ణరేఖ తీపి, రసాల ఘుమఘుమలు, పంచదార కంచెల తియ్యదనం, పండూరి మామిడి ప్రత్యేకత ..ఇలా అన్ని రకాల మామిడి పండ్లు సిద్ధంగా ఉన్నాయి. రైతులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మామిడి పండ్లను, కాయలను రైతు బజార్‌కు తీసుకువస్తున్నారు. నోరూరించే బంగినపల్లి, తియ్యటి సువర్ణరేఖ, కోలంగోవ, పరియా వంటి పండ్లతో పాటు, ఆవకాయ కోసం ప్రత్యేకంగా ఉపయోగించే కలెక్టర్, కొబ్బరి మామిడి, పనుకూలు, నీలం రకాల మామిడి కాయలు కూడా లభిస్తున్నాయి. ఆదివారం రైతు బజార్‌లో మామిడి వ్యాపారం జోరుగా సాగింది. మామిడి కాయలు కిలో రూ.35 నుంచి రూ.55 వరకు విక్రయించగా, పండ్లు రకాన్ని బట్టి రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముడవుతున్నాయి. వినియోగదారులు ఆసక్తిగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఆవకాయ కోసం కొన్న మామిడి కాయలను అక్కడికక్కడే ముక్కలు కొట్టించారు.

కూటమిపై ప్రజాగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

- 11 నెలల్లోనే తీవ్ర అసంతృప్తి
- 20 అడుగుల గోడ కట్టలేని వ్యక్తి అంతర్జాతీయ రాజధాని కడతాడట
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- సబ్బవరంలో పార్టీ కార్యాలయం ప్రారంభం

సబ్బవరం: 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సబ్బవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుతో కలిసి ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వేలాది మంది అభి మానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. 'మన ప్రభుత్వం అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ప్రతిపక్షాలకు సమావేశాలు నిర్వహించడానికి కూడా అవకాశం లేకుండా జగన్ మోహన్ రెడ్డి పాలన సాగించారు. ప్రజల పక్షాన పోరాడేందుకు ఏ ఒక్క సమస్య కూడా లేకుండా చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని అమర్‌నాథ్ ఆరోపించారు. సింహాచలం చందనోత్సవంలో జరిగిన అపశ్రుతిని ప్రస్తావిస్తూ, 20 అడుగుల గోడ కట్టలేని చంద్రబాబు అంతర్జాతీయ రాజధాని కడతానంటే భయమేస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?' అని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకుల వల్ల నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందని, ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల్లో విశ్వాసం నిలిపిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలకు ముఖం చాటేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. పార్టీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన తక్కువ సమయంలో ఇంత భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులను భారీ బైక్ ర్యాలీతో పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, పార్టీ అధికార ప్రతినిధి పైలా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శరగడం చినప్పలనాయుడు, పార్టీ సీయూసీ సభ్యులు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ జడ్పీటీసీ కోటాన రాము, పి. సురేష్ రాజ్, ఉప్పిలి కనకరాజు, సబ్బవరం ముత్యాలనాయుడు, చోప్పా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బూడి ముత్యాలనాయుడుతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమర్‌నాథ్,అదీప్‌రాజ్



వైఎస్సార్‌సీపీ నేతల భారీ బైక్ ర్యాలీ

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

పెందుర్తి: రెండు నెలల క్రితం అదృశ్యమైన సింహపురి కాలనీకి చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. పోలీసులు అతడిని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేపగుంట సమీపంలోని సింహపురి కాలనీకి చెందిన సదరు వ్యక్తి ఫిబ్రవరి 18న కనిపించకుండా పోవడంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కేవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, అతడ్ని శనివారం చెన్నైలో గుర్తించారు. అనంతరం ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడని సీఐ సతీష్ కుమార్ తెలిపారు.